క్లుప్తంగా

ఉపకార వేతనాల దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: రాష్ట్ర కార్మిక సంక్షేమ మండలి అమలు చేస్తున్న పథకాల్లో భాగంగా కార్మికుల పిల్లలకు ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు సహాయ కార్మిక శాఖ అధికారులు జీబీఎస్ స్వామి, ఎ.సత్యనారాయణరెడ్డి, ఎస్.వెంకటరమణలు తెలిపారు. గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని కార్మిక శాఖ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. 2021–2022 విద్యా సంవత్సరంలో ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనాలను అందిస్తామన్నారు. కార్మికశాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. 10వ తరగతి, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారికి రూ.1,000, పాలిటెక్నిక్ రూ.1,500, ఇంజినీరింగ్, మెడిసిన్, లా, బీఎస్సీ, బీసీఏ, ఎంసీఏ, బీఫార్మసీ తదితర కోర్సులు పూర్తి చేసిన వారికి రూ.2,000 చెల్లిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సూచించారు.

కేలండర్ ఆవిష్కరణ



కవాడిగూడ: తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో 2023 నూతన కేలండర్‌ను జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ డాక్టర్ సునిల్‌కుమార్‌బాబు ఆవిష్కరించారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొండాపురం జగన్, కార్యదర్శి మురహరి, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్, డీవీసీ అధికారి వెంకటయ్య, టీఎఎస్ఎస్ నాయకులు అఖిల్ నాయక్, వినోద్‌కుమార్, ప్రవీణ్, నర్సింగ్ తదితరులున్నారు.

జాతీయస్థాయి బాడీ బిల్డింగ్‌లో ప్రభు స్టీవెన్‌కు మూడో స్థానం



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఇటీవల గోవాలో నిర్వహించిన డ్రగ్‌ఫ్రీ జాతీయ స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో బాగ్‌లింగంపల్లిలోని అచ్చయ్యనగర్‌కు చెందిన ప్రభుస్టీవెన్ మూడోస్థానం సాధించారు. మెన్స్ ఫిజిక్ పోటీల్లోనూ.. 4వ స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు యువకులు, క్రీడాకారులు కలిసి అతడిని ప్రత్యేకంగా సన్మానించారు. గత 8 ఏళ్ళుగా బాడీబిల్డింగ్‌లో నిరంతరం సాధన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖులకు వ్యక్తిగతంగా శిక్షణ ఇస్తున్నామని తెలిసిన యువతకు సామాజిక సేవలో భాగంగా తగిన మెలుకువలు ఇస్తున్నామని పేర్కొన్నారు. గోవాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో 840 మంది పాల్గొనగా.. తాను మూడో స్థానాన్ని దక్కించుకున్నానన్నారు.

కార్పొరేటర్ పర్యటన

అడ్డగుట్ట: ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకొని దశలవారీగా వాటిని పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి తెలిపారు. గురువారం ఆజాద్ చంద్రశేఖర్ నగర్లో స్థానిక సమస్యలపై ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని బస్తీవాసులు కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో వెంటనే స్పందించిన ఆమె సంబంధిత సిబ్బందిని పిలిపించి పనులు చేయించారు. అనంతరం, మాట్లాడుతూ ఏసీఎస్ నగర్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికై గతంలోనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడం జరిగిందని తెలిపారు. అతి త్వరలో పనులను ప్రారంభించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సన్నాహాలు చేస్తున్నామని చెప్పారు. ఈ పర్యటనలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, మనోహర్, వడ్లూరి రవి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

గౌలిపురా: డివిజన్‌లోని ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి అన్నారు. గౌలిపురా డివిజన్‌లోని గాంధీనికేతన్ బస్తీలో శ్రీనివాస స్కూల్ వద్ద గురువారం ఆమె నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బస్తీలో రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో బస్తీవాసుల వినతి మేరకు రూ.4.75 లక్షలతో నూతన సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేటర్లకు ప్రత్యేక నిధులు కేటాయించకుండా అభివృద్ధిని అడ్డుకుంటుందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రఘుకాంత్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి సుమన్ కుమార్‌ముదిరాజ్, మజ్దూర్ మోర్చా కన్వీనర్ జమాల్‌పూర్ అశోక్, సాయికృష్ణ, శైలేందర్‌రెడ్డి, బస్తీవాసులు సాయికుమార్, ప్రదీప్, వెంకటేశ్‌గౌడ్, పాల్గొన్నారు.

మెట్రో ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలి



జేసీఎల్ చతుర్వేదికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: హైదరాబాద్ మెట్రోలో టికెట్, క్యాష్ మేనేజ్‌మెంట్ ఉద్యోగులకు కనీస వేతనాలు చెల్లించాలని సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు జె.కుమారస్వామి, కోశాధికారి ఆర్.వాణి డిమాండ్ చేశారు. ఇతర ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గురువారం వారు ఉద్యోగులతో కలసి ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయంలో రంగారెడ్డి జోన్ కార్మిక సంయుక్త కమిషనర్ ఎల్.చతుర్వేదిని కలిసి విన్నవించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెట్రోరైల్‌లో పనిచేస్తున్న టికెట్, క్యాష్ మేనేజ్‌మెంట్ సేవలు అందిస్తున్న ఉద్యోగులకు గత నాలుగున్నరేళ్లుగా వేతనాలు పెంచలేదన్నారు. గతంలో ఉన్న కాంట్రాక్ట్ ఏజెన్సీ వారు కనీస వేతనాలు ఇవ్వకుండా దోపిడి చేశారని ఆరోపించారు. పనిలో అనేక ఒత్తిడులు, భయభ్రాంతులకు గురిచేశారని మండిపడ్డారు. ఉద్యోగులు మెరుపు సమ్మెలోకి దిగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. మెట్రోరైల్ కార్మికులకు కనీసం వేతనాలు ఇవ్వాలని ప్రతినెల సాధారణ సెలవు ఇవ్వాలని కోరారు. అనారోగ్య, ప్రోత్సాహక సెలవులు ఇవ్వడంతో పాటు రోస్టర్‌ను వారానికోసారి మార్చాలన్నారు. ఆలస్య రుసుమును తొలగించి గ్రేస్ పీరియడ్ ఇవ్వాలని పేర్కొన్నారు. భోజన విరామాన్ని గంటపాటు ఇవ్వాలని మెట్రోరైల్ సేవలను ఉచితంగా అందించాలని స్పష్టం చేస్తూ.. ఈఎస్ఐ, పీఎఫ్ అమలులో అవకతవకలు తొలగించడంతో పాటు సూపర్‌వైజర్లు వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

గ్రంథాలయాలకు పూర్వ వైభవం

చిక్కడపల్లి: రాష్ట్రంలో గ్రంథాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, పర్యాటకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు పేర్కొన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా నగర గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కె.ప్రసన్నరామ్మూర్తి, రాష్ట్ర గ్రంథాలయ ఉద్యోగుల టీఎన్‌జీఓ సెంట్రల్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు శాగంటి అయోధ్య తదితరులు గురువారం మంత్రులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నగరంలో గ్రంథాలయలను అభివృద్ధి చేయడంలో ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతో గొప్పదని గ్రంథాలయ చైర్‌పర్సన్ కొనియాడారు. నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం, పలు భవనాల ఆధునీకరణకు నిధులను మంజూరు చేస్తూ గ్రంథాలయాల వైభవానికి ఎంతో సహకరిస్తున్నారన్నారు. బొల్లం మహేందర్, సుఖేష్ కుమార్, అవినాష్‌రావు, వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గం శక్తి కేంద్రాల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన పిలుపుమేరకు పోలింగ్ బూత్ స్థాయి కమిటీలు, శక్తి కేంద్రాల కమిటీలను గడువులోపు పూర్తి చేయాలన్నారు. అంబర్‌పేట అసెంబ్లీ ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డి, అంబర్‌పేట అసెంబ్లీ పాలక్ శ్రీవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు ఉమా రమేష్‌యాదవ్, అమృత, పద్మావెంకట్‌రెడ్డి, బీజేపీనేతలు నందకిషోర్‌యాదవ్, రమేష్, సూర్యప్రకాష్‌సింగ్, రమేష్‌యాదవ్, చిట్టి శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

సాహితీవేత్తలను గౌరవించడం మన సంప్రదాయం



పురస్కారాలను బహుకరిస్తున్న ఓలేటి పార్వతీశం

చిక్కడపల్లి: సాహితివేత్తలలోని ప్రతిభను గుర్తించి వారిని గౌరవించుకోవటం ఉత్తమ సంప్రదాయమని ప్రముఖ సాహితివేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం అన్నారు. గురువారం రాత్రి చిక్కడపల్లిలోని శ్రీ త్యాగరాయగానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో 'సాహితీ కిరణం మాస పత్రిక' నిర్వహణలో సాహితీవేత్త డాక్టర్ విజయలక్ష్మి 80 ఏళ్ల ఉత్సవ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరంతర రచనా శీలివిజయలక్ష్మీ మహాభారత కథలపై విశేష పరిశోధకులని కొనియాడారు. సభకు అధ్యక్షత వహించిన సాహితీవేత్త దత్తాత్రేయశర్మ మాట్లాడుతూ.. విజయలక్ష్మి 'సాహితీ జిగేష సంస్థ'ను స్థాపించి ఎందరో యువ కవులను ప్రోత్సాహిస్తున్నారన్నారు. 'సాహితీ కిరణం' పత్రిక సంపాదకులు పొత్తూరి సుబ్బారావు డాక్టర్ బి.జయరాములు, దమయంతిలను ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. జి.వెంకట్‌రెడ్డి, కవి వెంకటదాసు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



చేతిపంపును పరిశీలిస్తున్న సీపీఐ నేతలు

అడ్డగుట్ట: డివిజన్ పరిధిలోని నెలకొన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కన్వీనర్ కాంపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ నాయకులు సీ సెక్షన్లో పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీవాసులు వారి సమస్యలను విన్నవించుకున్నారు. అనంతరం కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సీసెక్షన్లోని మసీదు బస్తీలో తీవ్రమైన నీటి సమస్య ఉందన్నారు. గతంలో ఇక్కడ ఉన్నటువంటి చేతిపంపు పాడైపోయిందని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెప్పుకొస్తున్నారన్నారు. అదే విధంగా స్థానికంగా ఉన్న నాలా పక్కనే ఖాళీ స్థలం ఉండడంతో అది పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయిందని, దీంతో దుర్గంధం వెదజల్లుతుందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ పర్యటనలో సీపీఐ నాయకులు ఉమర్ఖాన్, శంకరయ్య, రంజిత్ సింగ్, యాదగిరి, రషీద్, ఖాజా, ఎస్‌కే. లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల విధుల పారితోషికాన్ని పెంచండి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న డిగ్రీ అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో డిగ్రీ పరీక్షల విధులు నిర్వహిస్తున్న అధ్యాపకుల పారితోషకాన్ని పెంచాలని వినతి పత్రం సమర్పించారు. గురువారం తెలంగాణ డిగ్రీ కాలేజీల లెక్చరర్స్ ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ కిశోర్‌కుమార్, కోశాధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం సమర్పించారు. విద్యార్థుల పరీక్షల ఫీజులను పెంచిన మూల్యాంకణ విధుల పారితోషకాన్ని పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దివ్యాంగురాలి జీవితంలో కొత్త వెలుగు

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జానపద కళల శాఖలో ఎం.ఏ జానపద కళల శాఖలో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగురాలైన కుమారి భాగ్యకు కృత్రిమ కాలును సమకూర్చడానికి వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడు కిషన్‌రావు ఆర్థిక సహకారం అందజేసి దివ్యాంగురాలు జీవితంలో కొత్త వెలుగును నింపారు. కుమారి భాగ్య దివ్యాంగురాలుగా ఉండి తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమే కాకుండా జానపద సంగీత నృత్యంలో అద్భుత ప్రదర్శనలిచ్చి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ విషయాన్ని పరిశీలించిన వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు ఆర్థిక సాయం అందించడమే కాకుండా సహృదయ దాతల సహకారంతో జర్మనీ సాంకేతిక పరికరంతో భాగ్య కృత్రిమ కాలుకు అయ్యే రూ.3 లక్షలను ఒట్టొబాక్ సంస్థ ప్రతినిధులకు గురువారం అందించారు. ఆర్థిక సహకారం అందించిన సప్తగిరి హోటల్స్ అధినేత రవికుమార్‌తో పాటు, ఇతర దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్సిటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య మురళీకృష్ణ, వర్సిటీ బాలికల వసతి గృహం వార్డెన్ డాక్టర్ వనజా ఉదయ్ పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌లో విద్యుత్ సమస్య తలెత్తకుండా చర్యలు

అబిడ్స్: ఎగ్జిబిషన్‌లో విద్యుత్ సమస్యలు, షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు ఎగ్జిబిషన్ విద్యుత్ సబ్ కమిటీ కన్వీనర్ వినయ్‌కుమార్ ముదిరాజ్, అడ్వైజర్ సురేందర్‌జీ యాదవ్ పేర్కొన్నారు. ఎగ్జిబిషన్‌లో స్టాళ్ల విద్యుత్ నిర్వహణపై ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రణాళికబద్ధంగా విద్యుత్ కనెక్షన్లను, విద్యుత్ సరఫరా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ నలుమూలలా రద్దీ ఉండే ప్రాంతాలను గుర్తించి ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. గతంలో విద్యుత్ బకాయిలు ఉన్నవారి వద్ద బకాయిలు వసూళ్లు చేస్తూ విద్యుత్ సరఫరా చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఎగ్జిబిషన్‌ను ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించి సందర్శకులను అలరించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు. విద్యుత్ సమస్యలు ఏ మాత్రం తలెత్తకుండా సిబ్బందిచే ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు.

పోషకాహార కేంద్రాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు

సైదాబాద్: బస్తీల్లోని చిన్నారులు, మహిళలకు అంగన్‌వాడీలు పోషకాహార కేంద్రాలుగా సేవలు అందిస్తున్నాయని దళిత ఉమెన్స్ కలెక్టివ్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుజాత సూరేపల్లి పేర్కొన్నారు. గురువారం ఆమె దళిత ఉమెన్స్ కలెక్టివ్ ప్రతినిధులతో కలిసి ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను కేంద్రాలలోని టీచర్లను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి కాలనీలో ఏర్పాటు చేసిన తొమ్మిది అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలకు పలు ఉపకరణాలు అవసరమని గుర్తించారు. 9 కేంద్రాలలోని 160 మంది విద్యార్థులకు అవసరమైన వాటర్ బాటిళ్లు, పలకలు, భోజనం ప్లేట్‌లు, ఆడుకోవటానికి బొమ్మలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... దళిత ఉమెన్స్ కలెక్టివ్ తరుపున అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులకు అవసరమైన మరికొన్ని పరికరాలు త్వరలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పావని, గంగ, దుశ్యంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించొద్దు..

హిమాయత్‌నగర్: "హెల్మెట్ ధరించండి, మద్యం తాగి వాహనం నడపొద్దు, ట్రాఫిక్ రూల్స్‌ను అతిక్రమించి ప్రమాదాల బారిన పడొద్దు" అంటూ ప్లకార్డులతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. హిమాయత్‌నగర్‌లోని శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు గురువారం ట్రాఫిక్ అవగాహన ర్యాలీ చేపట్టారు. ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసుల సమక్షంలో ప్రిన్సిపల్ జ్యోతి, ఏజీఎం సతీష్‌లు ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ..ట్రాఫిక్ రూల్స్ విషయంలో విద్యార్థి దశ నుంచే చిన్నారులకు అవగాహన ఉంటే పెద్దయ్యాక వారు రూల్స్‌ని అతిక్రమించరని అన్నారు.

చైన్ స్నాచర్ అరెస్టు

చైతన్యపురి: చైన్‌స్నాచింగ్‌కు పాల్పడిన కేసులో నిందితుడిని చైతన్యపురి పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ సమాచారం మేరకు... మోహన్‌నగర్ చౌరస్తాలో అనుమానాస్పదంగా తిరుగుతున్న గ్రీన్‌హిల్స్ కాలనీకి చెందిన లింగాల లక్ష్మారెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చైన్ స్నాచింగ్ విషయం బయటపడింది. మంగళవారం అల్కాపురి చౌరస్తాలో శ్యామలాంబ అనే వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్తుండగా ఆమె మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లినట్లు నిందితుడు అంగీకరించాడని ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించేందుకు నేరాల బాట పట్టినట్లు ఆయన తెలిపారు. నిందితుడి నుంచి 20 గ్రాముల బంగారు గొలుసు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రత్యేక పూజలు

మలక్‌పేట: ధనుర్మాస తిరుప్పావై ప్రవచనోత్సవాలలో భాగంగా గురువారం మూసారంబాగ్ ఆండాళ్ నిలయంలో 'ఏత్తకలంగళ్' మాతృశ్రీ రిందాదేవి తిరునక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రిందాదేవి విగ్రహానికి పుష్పాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశా రు. ఉ.వే.డాక్టర్ అప్పన్ కందాడై లక్ష్మణమూర్తి స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.

'మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కవిత తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో అధిక జనాభా గల మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జన్ను కనకరాజుమాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు మల్లేష్‌మాదిగలు డిమాండ్ చేశారు. ఎస్సీల్లో ఉన్న ఉపకులాలకు కూడా ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తే ప్రయోజనంగా ఉంటుందన్నారు.

- ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి ప్రధానమంత్రిని కలిసి ఒత్తిడి తీసుకొచ్చేందుకు అఖిలపక్ష బృందాన్ని ఢిల్లీకి పంపాలని వారు కోరారు. గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేతుల మీదుగా తెలంగాణ మాదిగల హక్కుల కోసం రూపొందించిన కరపత్రాన్ని ఆవిష్కరించామన్నారు.
- మాదిగల ఆత్మగౌరవ భవనాన్ని నిర్మించేందుకు పది ఎకరాల స్థలం రూ.10 కోట్ల నిధులను కేటాయించాలని వారు కోరారు. పారిశుద్ధ్య కార్మికులను క్రమబద్ధీకరించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాకయ్యమాదిగ, మహిళా నాయకురాలు విజయలక్ష్మి, కాగితప్రసాద్, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, గిరిబాబు, బాలమల్లేష్, శ్రీను, రాజు తదితరులున్నారు.

రెండో విడత ఈ - శ్రమ్ నమోదు

చిక్కడపల్లి: అసంఘటిత రంగ కార్మికులకు ప్రధాని నరేంద్రమోదీ కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ–శ్రమ్ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ అన్నారు. గురువారం చిక్కడపల్లి న్యాయ కళాశాలలో ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు రత్నసాయిచంద్ ఆధ్వర్యంలో రెండో విడత ఈ–శ్రమ్‌పోర్ట్ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఈ - కార్డు సభ్యత్వం తీసుకుంటే రూ.2 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ–శ్రమ్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీజేపీ నగర యువనాయకులు ఎ.వినయ్‌కుమార్, శ్రీకాంత్, సురేష్, కళాశాల ఇన్‌చార్జ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరవింద, శిరీష, రజనీ పాల్గొన్నారు.

మరమ్మతు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న జలమండలి డీజీఎం, కార్పొరేటర్ తదితరులు

కాచిగూడ: డ్రైనేజీ మ్యాన్‌హోల్ కుంగిపోయి ప్రమాదకరంగా మారడంతో స్థానికులు, పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మరమ్మతులు చేపడుతున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఉమారమేష్‌యాదవ్ అన్నారు. గురువారం చెప్పల్‌బజార్‌లో మ్యాన్‌హోల్ మరమ్మతు పనులను జలమండలి డీజీఎం సన్యాసిరావుతో కలిసి పర్యవేక్షించారు. జలమండలి బర్కత్‌పురా సెక్షన్ ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ యాదవ్, సాయిబాబా, నర్సింహ్మా, సత్యనారాయణ, భీమ్‌రాజ్, నాగరాజు, రవియాదవ్ తదితరులున్నారు.

పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: పేదల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు మోజెస్‌లు అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్ కమిటీ హాల్‌లో పలువురు వృద్ధులకు ఆసరా పింఛన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత వృద్ధాప్య పింఛన్‌ను పెంచడంతోపాటు, కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ లాంటి అనేక సంక్షేమ పథకాలను పేదలకోసం తీసుకొచ్చిందన్నారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్‌రెడ్డి, శ్రీను, శివకుమార్‌యాదవ్, జనార్ధన్, సత్యనారాయణ, సాబేర్‌అలీ తదితరులున్నారు.

రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు



కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సేవలను అందించేందుకు రైల్వే టికెట్ చెకింగ్ సిబ్బంది కృషి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే హైదరాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ శరత్ చంద్రయాన్ అన్నారు. గురువారం ఇండియన్ రైల్వే టికెట్ చెకింగ్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ డివిజనల్ అధ్యక్షుడు ఎం.కిరణ్‌కుమార్, కార్యదర్శి ఎం.కే.ఉదయ్ భాస్కర్, జాతీయ సంయుక్త కార్యదర్శి కె.శంకర్‌లు డీఆర్ఎంను మర్యాద పూర్వకంగా కలిసి ఆర్గనైజేషన్ రూపొందించిన కేలండర్‌ను అందజేశారు. ప్రయాణికుల సంక్షేమం, భద్రతకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు డీఆర్ఎం పేర్కొన్నారు.

అభినందన



ట్రస్ట్ బోర్డు సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు ట్రస్ట్ బోర్డును విస్తరించినట్లు చైర్మన్, ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. విస్తరణలో భాగంగా ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా రాఘవేందర్, శ్రీనివాస్‌రావు, సూర్యప్రకాష్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. నూతనంగా నియమితులైన ట్రస్టు బోర్డు సభ్యులను గురువారం కాచిగూడలోని ట్రస్ట్ బోర్డు కార్యాలయంలో అభినందించి సత్కరించారు. ట్రస్ట్ బోర్డు మేనేజింగ్ ట్రస్టీ పాండురంగారావు, కాశెట్టి ఆనంద్‌కుమార్ తదితరులున్నారు.

ఒత్తిడిని చిత్తు చేసేందుకే క్రీడలు

- సాంకేతిక విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య

రామంతాపూర్: విద్యార్థులు చదువుతో పాటు వివిధ క్రీడల్లో శిక్షణ పొంది జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో పాల్గొనాలని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్ పుల్లయ్య అన్నారు. రామంతాపూర్ జేఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు గురువారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా క్రీడల్లో పాల్గొనే విధంగా ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 37 ఫిజికల్ డైరెక్టర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ శ్రీనాథ్, రామంతాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏ.వినయ్‌కుమార్, రేణుకారెడ్డి, డాక్టర్ సురేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.